
సాక్షి గుంటూరు

బుధవారం । 14 । ఆగస్టు । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ మంగళవారం సాయంత్రానికి 38.94 టీఎంసీలకు చేరింది. దిగువకు 2400 క్యూసెక్కులు వదిలారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 589.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,086 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని నాగుల గుడి దేవస్థానంలో సంతాన సుబ్రహ్మణేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

పేదలకు రూ.5కు నాణ్యమైన ఆహారం

సాక్షి, అమరావతి, మంగళగిరి : అధికారంలోకి వస్తే అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నాయుడు ఆచరణలోకి తీసుకొస్తున్నారని మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. ఈనెల 15న గుడివాడలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ క్యాంటీన్లను అందుబాటులోకి తెస్తున్నట్టు ప్రకటించారు. ఈ క్యాంటీన్లకు ఆహారం సరఫరా చేసే మంగళగిరి సమీపంలోని తెనాలి రోడ్డులో ఉన్న హరేకృష్ణ మూవ్‌మెంట్ సెంట్రల్ కిచెన్‌ను మంగళవారం మంత్రి నారాయణ పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఈనెల 15న కృష్ణా జిల్లా గుడివాడలో అన్న క్యాంటీన్‌ను సీఎం ప్రారంభిస్తారన్నారు. మరో 99 క్యాంటీన్లు మరుసటి రోజు ప్రారంభమవుతాయని వివరించారు. ఈ క్యాంటీన్లకు ఆహార సరఫరా టెండర్‌ను హరేకృష్ణ మూవ్‌మెంట్ సంస్థ దక్కించుకుందన్నారు. మరోవైపు అన్న క్యాంటీన్ల కోసం విరాళాలు ఇచ్చేందుకు ఎంతో మంది ముందుకొస్తున్నారని, మంగళవారం ఎస్ఎల్‌వీ గ్రూప్ శ్రీనివాసరాజు రూ.కోటి విరాళం ఇచ్చినట్టు తెలిపారు. అన్న క్యాంటీన్ల కోసం ప్రత్యేక కార్పస్ ఫండ్, చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినట్టు మంత్రి నారాయణ చెప్పారు. విరాళాలు ఇచ్చేవారు అన్న క్యాంటీన్స్, అకౌంట్ నంబర్ 37818165097, చంద్రమౌళీనగర్, గుంటూరు, ఐఎఫ్ఎస్‌సీ నంబర్ SBIN0020540 ఖాతాకు పంపించాలని ఆయన కోరారు.

అక్షయపాత్రకు భాష్యం విద్యా సంస్థల రూ.కోటి విరాళం



గుంటూరు ఎడ్యుకేషన్ : అన్న క్యాంటీన్ల నిర్వహణ కోసం నూతన వంటశాలల నిర్మాణానికి అక్షయపాత్ర ఫౌండేషన్‌కు భాష్యం విద్యాసంస్థలు రూ.50 లక్షల విరాళాన్ని అందజేశాయి. అదే విధంగా విజయవాడ-గుంటూరు జాతీయ రహదారి సమీపంలోని కొలనుకొండ వద్ద నూతనంగా నిర్మిస్తున్న హరేకృష్ణ గోకుల క్షేత్ర నిర్మాణానికి మరో రూ.50 లక్షల చొప్పున కోటి రూపాయలను భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తనయుడు భాష్యం సాకేత్ రామ్ మంగళవారం వెలగపూడిలోని సచివాలయంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా హరేకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులకు చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్-పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పాల్గొన్నారు.

5కే మారథాన్‌లో విద్యార్థినుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ విభాగం, జిల్లా ఎయిడ్స్-క్షయ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన మహిళల 5కే మారథాన్‌లో టీజేపీఎస్ కళాశాల విద్యార్థినులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజేతలుగా నిలిచినట్లు కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం తెలిపారు. మంగళవారం పట్టాభిపురంలోని కళాశాలలో కేవీ బ్రహ్మంతోపాటు పీజీ, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.అనితాదేవి, ఏబీపీ మనోహర్ పాల్గొని విద్యార్థినులను అభినందించారు. విజేతలుగా నిలిచిన సి.చేతన, ఎస్‌కే పర్వీన్ రూ.ఏడువేలు, రూ.ఐదువేలు నగదు బహుమతులు సాధించినట్లు వివరించారు. ఈసందర్భంగా కళాశాల అధ్యక్షుడు పోలిశెట్టి శ్యాం సుందర్, వాసవి విద్యానిధి కమిటీ కార్యదర్శి పోలిశెట్టి నాగ సుందరం, ఎన్ఎస్ఎస్ జిల్లా అధికారి జేవీ సుధీర్‌కుమార్, ఆర్.జయశైలజ, వ్యాయామ అధ్యాపకుడు ఆర్.శివాజీ విద్యార్థినులను అభినందించారు.

55,002 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 55,002 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 52,954 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,700 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 15,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. యార్డులో ఇంకా 23,296 బస్తాల మిర్చి నిల్వ ఉంది.



జెండా జయహే


మువ్వన్నెలు మెరిశాయి. అడుగుఅడుగులో స్వాతంత్య్ర స్ఫూర్తి వెల్లివిరిసింది. విద్యార్థుల గుండెల్లో దేశభక్తి పారవశ్యం ఉప్పొంగింది. ఆగస్టు 15 స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా తెనాలిలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో మంగళవారం 250 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. 500 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత ర్యాలీని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా ప్రముఖ్ అవ్వారు శ్రీనివాస్, ఏబీవీపీ తెనాలి గౌరవాధ్యక్షులు పాటిబండ్ల శ్రీనివాసరావు ప్రారంభించారు. – తెనాలిఅర్బన్

స్వాతంత్య్ర గర్జన

- స్వరాజ్య ఉద్యమంలో గుంటూరు కీలక భూమిక
- సిపాయిల తిరుగుబాటు కంటే ముందే పోరుబావుటా
- నాగలి సమ్మెతో గడగడలాడించిన కర్షకులు
- దేశనాయకుల మార్గదర్శకంలో పిడికిలెత్తిన జనం
- బ్రిటీష్ సేనలను తరిమికొట్టిన వైనం

స్వాతంత్య్రోద్యమంలో గుంటూరు జిల్లా గర్జించింది. సిపాయిల తిరుగుబాటు కంటే ముందే పోరుబావుటా ఎగురేసింది. నాగలి సమ్మెతో తిరుగుబాటు చేసింది. దేశ నాయకుల పిలుపుతో ప్రతి ఘట్టంలోనూ పిడికిలెత్తి కదన రంగాన కాలుదువ్వింది. సూర్యుడు అస్తమించని రాజ్యానికి కాళ రాత్రులు చూపింది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లాలో జరిగిన కీలకఘట్టాల గురించి ఓసారి తెలుసుకుందాం.. – తెనాలి

సహాయ నిరాకరణం



కొండా వెంకటప్పయ్య

సహాయ నిరాకరణోద్యమంలో మద్రాస్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యత్వానికి జిల్లాకు చెందిన కొండా వెంకటప్పయ్య రాజీనామా చేశారు. రాష్ట్రంలో నలుగురు ప్రముఖులు గౌరవ మేజిస్ట్రేట్ పదవులకు రాజీమా చేయగా అందులో మౌల్వీ మొహమ్మద్ రజాసాహెబ్, ఏలూరు హనుమంతరావు జిల్లాకు చెందినవారున్నారు. 1920 సెప్టెంబరు 28న గుంటూరు బార్ అసోసియేషన్ చేసిన తీర్మానంతో న్యాయవాదులు 11 నెలలు విధులను బహిష్కరించారు. జిల్లాలోని కరణాలు/మునసబులు 16 మంది రాజీనామా చేయగా, రేపల్లెలో 8 మంది, నరసరావుపేటలో ఆరుగురు కౌన్సిలర్లు సభ్యత్వాలను వదులుకున్నారు.

నాగలి కన్నెర్ర



భారత ప్రథమ స్వాతంత్య్ర పోరాటం (1857) కంటే ముందే 17వ శతాబ్ది ప్రారంభంలో జిల్లాలోని నాదెండ్ల సమితిలో జరిగిన నాగలి సమ్మె ఓ చరిత్ర. నేడు సర్కారు జిల్లాలుగా పిలుస్తున్న ఆరు జిల్లాలు అప్పట్లో నిజాం పాలనలో ఉండేవి. గుంటూరు కృష్ణాజిల్లాలో అంతర్భాగం. కరవు రోజుల్లో పన్ను బకాయిల కోసం ఆస్తుల జప్తుకు పాలకులు తెగబడ్డారు. దీంతో రైతులు తిరగబడ్డారు. నాగలి, గొర్రు, గుంటక, పలుగు, పార మంచెపై పెట్టి వ్యవసాయం మానేసి, చేతిపనివారితో సహా సమ్మె చేశారు. నిజాం పాలకులు దిగొచ్చి పన్నులను రద్దుచేశారు. పన్నులకు వ్యతిరేకంగా గ్రామీణ శ్రామిక జనాలు సమైక్యంగా పోరాడటం అదే ప్రథమం.

'శాంతిసేన' సమరం



పర్వతనేని వీరయ్యచౌదరి

1922 జనవరి 7న విజయవాడలో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ పన్నుల నిరాకరణ తీర్మానాన్ని చేసింది. జిల్లాలో, ముఖ్యంగా పెదనందిపాడు ఫిర్కా అమలుచేసింది. అన్ని గ్రామాల్లోని కరణాలు, మునసబులు రాజీనామా చేసి చరిత్రను సృష్టించారు. పర్వతనేని వీరయ్యచౌదరి నాయకత్వంలో కాంగ్రెస్ 'శాంతిసేన' సైనికుల ప్రచారంతో ప్రభుత్వంపై సహాయనిరాకరణ తీవ్రంచేశారు. అణచివేతను బ్రిటిష్ ప్రభుత్వం జిల్లా అదనపు కలెక్టరు రూథర్‌ఫర్డ్‌కు అప్పగించింది. ఆస్తుల జప్తుకు పూనుకున్నా సాధ్యపడకుండా చిత్రవిచిత్రమైన వ్యూహాలను నేతలు అనుసరించారు.

'ఉరి'కిన చిన్నపరెడ్డి

➡ 1909 ఫిబ్రవరి 18న కోటప్పకొండ తిరునాళ్లలో పోలీసుల దాష్టీకానికి వ్యతిరేకంగా ప్రజలు తిరగబడ్డారు. పోలీసు ఠాణాను తగులబెట్టారు. ఆ దాడిలో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు చనిపోయారు. కొత్తరెడ్డిపాలెంకు చెందిన గాదె చిన్నపరెడ్డితో సహా 45 మందిని అరెస్టుచేశారు. వీరిలో 17 మందికి జైలుశిక్ష, నలుగురుకి యావజ్జీవం, చిన్నపరెడ్డికి ఉరిశిక్ష వేశారు.

ద్వీపాంతర వాస శిక్ష

➡ 1909లోనే బ్రిటిష్ వైస్రాయ్ ప్రయాణించనున్న రైలును పేల్చేందుకు కుట్ర పన్నారనే కేసులో తెనాలి సమీపంలోని కంచర్లపాలెంకు చెందిన చుక్కపల్లి రామయ్య, కఠెవరంవాసులు కోటంరాజు వెంకట్రాయుడు, లక్కరాజు బసవయ్యను పోలీసులు అరెస్టు చేశారు. రామయ్యకు పదేళ్లు, బసవయ్యకు ఐదేళ్ల ద్వీపాంతరవాస శిక్ష విధించారు.

కాంగ్రెస్ లీగ్ ఒడంబడికకు మద్దతు

➡ స్వదేశీ ఉద్యమానికి గుంటూరులో కొండా వెంకటప్పయ్య, వింజమూరి భావనాచారి నాయకత్వం వహించారు. మాంటేగ్-చేమ్స్‌ఫర్డ్ సంస్కరణలపై ఆంధ్ర మహాసభ 1918 ఆగస్టు 17న గుంటూరులో కాశీనాధుని నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశమైంది. కాంగ్రెస్ లీగ్ ఒడంబడికను అమలు చేయాలంటూ ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది.

అతివాదులకు మద్దతు



తెనాలిలో జరిగిన కృష్ణా మండల రాజకీయ సభ

బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా వందేమాతర ఉద్యమం ఊపందుకుంటున్న సమయంలో మితవాద, అతివాద పక్షాలు ఏర్పడ్డాయి. 1908 వేసవిలో తెనాలిలో జరిగిన కృష్ణాజిల్లా కాంగ్రెస్ అసోసియేషన్ సమావేశం అతివాదులను బలపరిచింది.

కన్నెగంటి హనుమంతు బలిదానం



➡ అడవుల పరిపాలనా చట్ట నిబంధనల్ని ఉల్లంఘించి, అడవుల్లో పశువుల మేతకు చెల్లించాల్సిన పుల్లరిని వ్యతిరేకిస్తూ పల్నాడులో ఉద్యమం జరిగింది. 1921 సెప్టెంబరు 23న బ్రిటిష్ సాయుధ దళాలు అడవిలో రైతులు మేపుతున్న పశువులను అడ్డుకుని బందెలదొడ్డికి తరలించారు. కోపోద్రిక్తులైన ప్రజలు రాళ్లవర్షం కురిపించారు. పోలీసు కాల్పుల్లో రైతు నేత కన్నెగంటి హనుమంతు సహా ముగ్గురు మరణించారు.

➡ ఉప్పు సత్యాగ్రహం, సైమన్ కమిషన్ గోబ్యాక్, క్విట్ ఇండియా ఉద్యమాల్లోనూ జిల్లా నాయకులు, ప్రజలు చురుగ్గా పాల్గొన్నారు.

'డ్రగుల్బాజీలు'

- ఢిల్లీ టూ గుంటూరు
- ఎండీఎం డ్రగ్స్ యథేచ్ఛగా సరఫరా
- రావి మస్తాన్ సాయి అరెస్ట్‌తో మరోసారి కలకలం
- సంపన్నవర్గాల లక్ష్యంగానే అమ్మకాలు
- ప్రధాన సూత్రధారులు గుంటూరు వాసులే
- మస్తాన్‌సాయి అరెస్ట్ అంశంలో గుంటూరు పోలీసుల చేతివాటం..?



సాక్షిప్రతినిధి, గుంటూరు, పట్నంబజారు: డ్రగ్స్ దగుల్బాజీలు పేట్రేగిపోతున్నారు. ఢిల్లీ టూ గుంటూరు డ్రగ్స్ సరఫరా యథేచ్ఛగా సాగిస్తున్నారు. తాజాగా గుంటూరులో డ్రగ్స్ మూలాలు బయటపడడం కలకలం రేపుతోంది. గుంటూరు నగరంపాలెం మస్తానయ్య దర్గాలో డ్రగ్ పెడ్లర్ రావి మస్తాన్‌సాయిని సోమవారం ఎస్ఈబీ పోలీసులు అరెస్టు చేయడం నగరంలో సంచలనం సృష్టించింది.

గతంలోనూ ఘటనలు

» కొద్ది నెలల కిందట లాలాపేట పోలీసుస్టేషన్ పరిధిలో లోకేష్ అనే యువకుడు ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఎండీఎం డ్రగ్ తీసుకుని వస్తున్న క్రమంలో సంపత్‌నగర్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఆ కేసులో ప్రధాన నిందితుడు చల్లా గోపీ కోర్టులో లొంగిపోయాడు. వారి నుంచి సుమారు 10 గ్రాముల వరకు ఎండీఎం స్వాధీనం చేసుకున్నారు.

» గతంలో పట్టాభిపురం పోలీసుస్టేషన్ పరిధిలోనూ డ్రగ్స్‌ను పట్టుకున్నారు. గత నెలలో నల్లపాడు పరిధిలో ఎస్ఈబీ పోలీసులు డ్రగ్స్ పట్టుకుని ఇద్దరిని అరెస్టు చేశారు.

విజయవాడలో దొరికిన నిందితుల స్టేట్‌మెంట్ ఆధారంగా..

విజయవాడలో దొరికిన నిందితులు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా అక్కడి ఎస్ఈబీ పోలీసులు గుంటూరు వచ్చి మస్తాన్‌సాయిని సోమవారం అరెస్టు చేశారు. జూన్ 30న గుంటూరులో బాగా గుర్తింపు ఉన్న ఒక హోటల్ నిర్వాహకులు షేక్ నాగూర్ షరీఫ్, ఖాజామొహీద్దీన్ డ్రగ్స్ సరఫరా చేస్తున్న క్రమంలో విజయవాడలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని 30 గ్రాముల ఎండీఎం పట్టుకున్నారు. వారు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా మస్తాన్‌సాయిని ఏ-5గా అదుపులోకి తీసుకున్నారు. గతంలోనూ షరీఫ్, ఖాజామొహీద్దీన్‌లపై మాదకద్రవ్యాల కేసు నమోదైంది.

గుంటూరు పోలీసులకు తెలిసినా..?

జూన్ 30న అరెస్ట్ అయిన షరీఫ్, ఖాజామొహీద్దీన్‌లు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా మస్తాన్‌సాయిపై ఎస్ఈబీ అధికారులు దృష్టి సారించారు. మస్తాన్ దర్గాలోనే తలదాచుకుంటున్న మస్తాన్‌సాయి గురించి తెలిసిన గుంటూరు వెస్ట్ సబ్‌డివిజన్‌లోని ఒక పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, ఆయన మఫ్టీపార్టీ హెడ్ కానిస్టేబుల్ మస్తాన్‌సాయి తండ్రి వద్ద బేరం కుదుర్చుకుని వదిలిపెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో లాలాపేట పీఎస్‌లో జరిగిన డ్రగ్స్ కేసులో అప్పటి సీఐపై ఆరోపణలు రావటంతో అప్పటికప్పుడు ఎస్పీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని అధికారులు ఆదేశించిన సంగతి తెలిసిందే.

విస్తరిస్తున్న డ్రగ్స్ కల్చర్

ఢిల్లీ, ముంబై, హైదరాబాద్ వంటి ప్రాంతాలకే పరిమితమైన డ్రగ్స్ కల్చర్ గుంటూరులో విస్తరిస్తోంది. సంపన్నవర్గాలు, కొంత మంది యువతులు, పలు యూనివర్సిటీల విద్యార్థులే లక్ష్యంగా డ్రగ్స్ విక్రయాలు జరగుతున్నాయి. వీటిల్లో ప్రధాన పాత్రధారులుగా ఉన్న షరీఫ్, ఖాజామొహీద్దీన్, మస్తాన్‌సాయి గుంటూరు వాసులే. కేవలం గంజాయికే పరిమితమైన చోట తరచూ డ్రగ్స్ దొరకడం చర్చనీయాంశంగా మారింది. డ్రగ్స్ వినియోగిస్తున్న వారిలో అధికంగా యువతులు, విద్యార్థులు ఉండటం ఆందోళన కలిగించే అంశం. ఇటీవల పోలీసులు డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న సందర్భంగా జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ డ్రగ్స్ వాడుతున్న వారిని, వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. మళ్లీ వాడుతున్నట్లు తేలితే వారిపైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

టీడీపీ నేతల దాష్టీకం

- పెదపరిమిలో వైఎస్సార్ సీపీ కుటుంబాలపై దౌర్జన్యం
- ఇళ్లపై దాడులు.. సామగ్రి ధ్వంసం
- మహిళలపైనా దుర్భాషలు.
- వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం సభ్యుల వద్ద బాధితుల మొర



కావూరి ఫకీరయ్య, నరేష్

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్)/తాడికొండ: టీడీపీ నేతల దాష్టీకాలు ఆగడం లేదు. తాడికొండ నియోజకవర్గం తుళ్ళూరు మండలం పెదపరిమి గ్రామంలోని సుమారు 300కుపైగా వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల కుటుంబాలపై అధికారపార్టీ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. నిత్యం చిత్రహింసలకు గురిచేస్తున్నారు. దీనిపై జిల్లా కోర్టులోని వైఎస్సార్ సీపీ లీగల్ విభాగ సభ్యులకు వివరించేందుకు ఆ గ్రామానికి చెందిన కావూరి ఫకీరయ్య, కావూరి నరేష్ మంగళవారం వచ్చారు. వారు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఎన్నికలైన తర్వాత నుంచి టీడీపీ నేతలు తమ నివాసాలపై దాడి చేసి సామాన్లు పగలగొడుతున్నారని, మహిళలను దుర్భాషలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమపై దాడి చేయడమే కాకుండా తిరిగి తమపైనే కేసులు పెడుతున్నారని, ఇళ్లకు పోలీసులను పంపిస్తున్నారని విన్నవించారు. పోలీసులు కూడా టీడీపీ నేతల ఒత్తిళ్లతో తమ ఇళ్లకు వచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ నేతలు కావూరి అశోక్, అనోక్, చందు, నవీన్, వంశీ, దావీదు, పవన్, ప్రసాద్‌తోపాటు మరికొందరు ఈ దాడులు చేయిస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ నేతలు, పోలీసుల వేధింపులు తాళలేక తాము ఊరు వదిలి బయట గ్రామాలకు వెళ్లి తలదాచుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సుమారు 20 కుటుంబాలకు చెందిన వాళ్లు ఊరు వదిలి వెళ్లిపోయారని పేర్కొన్నారు.

ఇసుకకు ఆధార్, ఫోన్ నంబర్ తప్పనిసరి

- ప్రభుత్వం నిర్ణయించిన ధరే చెల్లించాలి
- బయట మార్కెట్‌లో అమ్మిన వారిపై కఠిన చర్యలు
- కలెక్టర్ నాగలక్ష్మి వెల్లడి



మున్నంగి స్టాక్ పాయింట్ వద్ద ట్రాక్టర్లకు ఇస్తున్న వే బిల్లును పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

మున్నంగి(కొల్లిపర): ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఆధార్ కార్డుతోపాటు సొంత ఫోన్ నంబరు నమోదు చేయించి టన్నుకు రూ.250 చొప్పున ఆన్‌లైన్‌లో చెల్లించిన తరువాత ఇసుకను లోడ్ చేసుకుని తీసుకెళ్లాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చెప్పారు. మున్నంగి గ్రామం వద్ద కృష్ణా నది కరకట్ట దిగువన ఉన్న ఇసుక స్టాక్ పాయింట్‌ను మంగళవారం తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్, తహసీల్దార్ సిద్ధార్థతో కలిసి ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. ఆన్‌లైన్ చెల్లింపు, వే బిల్లు రికార్డులను పరిశీలించారు. రికార్డుల్లో నమోదైన ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి నిజంగా ఇసుక తీసుకెళ్లారా? ఎంత చెల్లించారు? అనే అంశాలను ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ స్టాక్ పాయింట్ వద్ద ఎక్కువ శాతం లారీ యజమానులు, మధ్యవర్తులు ఆధార్ కార్డులు తీసుకు వచ్చి ఇసుక తీసుకెళ్లి విజయవాడ, గుంటూరు వంటి నగరాల్లో ఎక్కువ రేటుకు అమ్ముతున్నట్లు తమకు ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. స్టాక్ పాయింట్ వద్ద ఉన్న అధికారులు ఫోన్ నంబర్లు, ఆధార్ కార్డులపై నిత్యం నిఘా ఉంచాలని ఆదేశించారు. ఫోన్ నంబర్, ఆధార్ సరైనవి కాకపోయినా, రోజూ ఒకే నంబర్లు వస్తున్నా వాహనాలను గుర్తించి అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేయాలని చెప్పారు. ప్రభుత్వం మున్నంగి స్టాక్ పాయింట్ వద్ద సుమారు 30 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, ఇది మరో మూడు రోజులు సరిపోతుందని వివరించారు. స్టాక్ పాయింట్ వద్ద ఎలాంటి అక్రమాలు జరిగినా వినియోగదారులు అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట రూరల్ సీఐ బెల్లంకొండ శ్రీనివాసరావు, ఎస్ఐ పోతురాజు, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో ఉద్రిక్తత

- గ్రామంలో పికెట్ ఏర్పాటు
- మోహరించిన పోలీసు బలగాలు
- ఏఎస్పీ, డీఎస్పీల ఆధ్వర్యంలో పర్యవేక్షణ



అమరావతి మసీదు సెంటర్‌లో మోహరించిన పోలీసులు

అమరావతి: ముస్లింలపై దాడి సంఘటనతో అమరావతిలో ఉద్రిక్తత నెలకొంది. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు గ్రామంలో మూడుచోట్ల పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేసి 144వ సెక్షన్ విధించారు. సోమవారం రాత్రి సుమారు ఏడు గంటల సమయంలో ముస్లింలపై కర్రలు, రాడ్లతో దాడి జరగటంతో పలువురు గాయపడ్డ విషయం విదితమే. దీంతో గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్పీ రాఘవేంద్ర, సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబుల ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నారు.

గాయపడిన వారు కోలుకుంటున్నారు

లింగాపురం గ్రామస్తుల దాడిలో గాయపడిన నేలపాటి బాజీ, షేక్ బుజ్జి, షేక్ సద్దాం, షేక్ కరీముల్లా షేక్ యాసిన్, షేక్ ఖాజావలిల ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు, వారు గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

ఎస్పీ సమీక్ష

అమరావతిలో చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో కేసుల నమోదు, కేసు పురోగతిపై పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమీక్షించారు. సమీక్షలో అడిషనల్ ఎస్పీ రాఘవేంద్ర, సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబు, సీఐ ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రెండు వర్గాలపైన కేసులు

ఉదయం స్థానిక దుర్గావిలాస్ వద్ద తమపై స్థానిక టీడీపీ మైనార్టీ నాయకుడు షేక్ జానీ వర్గీయులు దాడి చేశారని లింగాపురం మాజీ సర్పంచ్ చిరుమామిళ్ల శౌరయ్య వర్గీయులు చేసిన ఫిర్యాదులో 20మందిపైన, సాయంత్రం లింగాపురానికి చెందిన చిరుమామిళ్ల శౌరయ్య వర్గీయులు చేసిన దాడిలో నేలపాటి బాజీ, షేక్ బుజ్జి, షేక్ సద్దాం, షేక్ కరీముల్లా షేక్ యాసిన్, షేక్ ఖాజావలిలపై దాడి చేసి గాయపరిచిన కేసు 27మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం శ్రీనివాసరావు తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.3,200, గరిష్ట ధర రూ.5,000, మోడల్ ధర రూ.4,200 వరకు పలికింది.

100 రోజుల్లో 3వేల ఇళ్ల నిర్మాణాలు

- జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి
- పెదరావూరు జగనన్న కాలనీలో పర్యటన

తెనాలిఅర్బన్: జిల్లాలో 100 రోజుల్లో మూడు వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. తెనాలి మండలం పెదరావూరులోని జగనన్న కాలనీ లే అవుట్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు. లే అవుట్‌లో జరిగిన ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ ఈఈ భాస్కరరావు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు ప్రారంభించిన ప్రతి ఇంటిని త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సొంతగా నిర్మించుకునే వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించి నిర్మాణాలు వేగవంతం చేసేలా చూడాలన్నారు.



జగనన్న కాలనీలోని లే అవుట్‌ను పరిశీలించి, అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

అలాగే లే అవుట్‌లో ఇళ్లు నిర్మిస్తున్న ఐదుగురు కాంట్రాక్టర్లతో మాట్లాడి త్వరగా వాటిని పూర్తి చేయించాలని సూచించారు. స్థానికులు జిల్లా కలెక్టర్‌ను కలిసి విద్యుత్ దీపాలు వెలగడం లేదని, రోడ్లు గుంతలుగా మారడం వలన ఇబ్బందులు పడుతున్నామని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే వాటిని పరిష్కరించాలని తహసీల్దార్ గోపాలకృష్ణ, కమిషనర్ బండి శేషన్నను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. బేస్ మట్టం, శ్లాబ్ స్థాయిలో ఉన్న ఇళ్లను కూడా త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ముందుగా బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్టు యార్డును ఆమె పరిశీలించారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్, స్పెషల్ ఆఫీసర్ గాయత్రీదేవి, పలువురు మున్సిపల్, హౌసింగ్ అధికారులు ఉన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

వీఐటీ – ఏపీ యాంటీ ర్యాగింగ్ డేలో జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్

తాడికొండ: విద్యా సంస్థల లోపల, వెలుపల ర్యాగింగ్ నిషేధమని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడినట్లు తెలిస్తే వారు కళాశాల నుంచి సస్పెన్షన్‌కు గురవడంతో పాటు తొలగించడం కూడా జరుగుతుందని గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ అన్నారు. తుళ్లూరు మండలం ఐనవోలు వీఐటీ - ఏపీ విశ్వ విద్యాలయంలో మంగళవారం నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ దినోత్సవంలో



మాట్లాడుతున్న ఎస్పీ ఎస్.సతీష్ కుమార్

ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ర్యాగింగ్ నిషేధ చట్టం 1977 ప్రకారం విద్యార్థులను ర్యాగింగ్ అనే విష సంస్కృతితో వేధించడం చట్టరీత్యా నేరమని, విద్యార్థులు ఆ సంస్కృతిని విడనాడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. వీసీ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి మాట్లాడుతూ నేటి విద్యార్థులు సరైన విషయాల కోసం సమయాన్ని వెచ్చిస్తే మరింత సామర్థ్యం పెంచుకోవడంతో పాటు నైపుణ్యాలను మెరుగుపరచుకొని కెరీర్‌లో అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర ముదిగంటి విద్యార్థులతో యాంటీ ర్యాగింగ్ ప్రతిజ్ఞ చేయించారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీడీ డాక్టర్ ఖాదిర్ పాషా, ఏడీ డాక్టర్ రాఖీ పాల్గొన్నారు.

ఉత్కంఠగా ప్రకాశం-తూర్పు గోదావరి మ్యాచ్

మంగళగిరి: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నవులూరు అమరావతి క్రికెట్ టౌన్‌షిప్‌లోగల ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఏసీఏ అండర్ -19మెన్ మల్టీ డే ఇంటర్ డిస్ట్రిక్ పోటీలలో భాగంగా మంగళవారం జరిగిన ప్రకాశం, తూర్పు గోదావరి మ్యాచ్ ఉత్కంఠగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రకాశం జట్టు 38.2 ఓవర్లలో 121 పరుగులకు ఆలౌటైంది. ప్రకాశం



ఈస్ట్ గోదావరి బౌలర్ మోసెస్ (5 వికెట్లు)

బ్యాట్స్‌మెన్ ఎం.మనీష్ 44 పరుగులు చేయగా కె.ఆనంద్ 41 పరుగులు చేశాడు. ఈస్ట్ గోదావరి బౌలర్ మోసెస్ 5 వికెట్లు తీసి రాణించాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన తూర్పు గోదావరి జట్టు 32 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 119 పరుగులు చేయగా బ్యాట్స్‌మెన్ డి.ఆకాష్ 41 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ప్రకాశం బ్యాట్స్‌మెన్ ఆర్.ప్రణదీప్ 2 వికెట్లు తీసి రాణించాడు.

క్రెడాయ్ గుంటూరు చాప్టర్ నూతన కమిటీ ఎంపిక



గుంటూరు రూరల్: నవ్యాంధ్ర రాజధానిలో భాగమైన క్రెడాయ్ గుంటూరు చాప్టర్‌కు నూతన కమిటీ ఎంపిక కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. నగర శివారుల్లోని ఎంజీ ఇన్నర్ రింగ్‌రోడ్డులోగల శ్రీ కన్వెన్షన్‌నందు జరిగిన జనరల్ బాడీ మీటింగ్‌లో నూతన కమిటీ ఎంపిక నిర్వహించారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగింది. క్రెడాయ్ గుంటూరు చాప్టర్ ఎలక్షన్ కమిటీ సభ్యులు ఆళ్ల శివారెడ్డి, మాజేటి ప్రసాద్, వంగా జగన్‌మోహన్‌రెడ్డిలు నూతన కమిటీ సభ్యులను అభినందించారు. క్రెడాయ్ గుంటూరు చాప్టర్ నూతన కమిటీ 2024–25 చైర్మన్‌గా ఆరుమళ్ల సతీష్‌రెడ్డి, అధ్యక్షుడిగా మామిడి రాము, వైస్ ప్రెసిడెంట్ తియ్యగూర వినోద్‌రెడ్డి, వెల్లపు శివనాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీ మెట్టు సాంబశివారెడ్డి, జాయింట్ సెక్రటరీస్ మద్ది వెంకటనాగ కార్తిక్, వట్టికూటి రమాకాంత్, అన్నప్పరెడ్డి భరత్‌రెడ్డి, ట్రజరర్ ఆళ్ల వెంకట నాగార్జునరెడ్డి, ఈసీ మెంబర్స్‌గా జి.వెంకటరెడ్డి, పి.సాహిత్, వై.పవన్‌కుమార్, జి.శివనాగబాబు, మెట్టు వెంకటరెడ్డి, పి.వేణుగోపాల్‌రెడ్డి, ఎం.కళ్యాణ్‌చక్రవర్తి, బడే సుబ్బారెడ్డి, శంకరరాజ గోపాల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగిందని ఆళ్ల శివారెడ్డి తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో వైద్యురాలికి ఆరునెలల జైలు

మంగళగిరి: చెల్లని చెక్కు కేసులో ఓ వైద్యురాలికి ఆరు నెలల జైలు శిక్ష పడిన ఘటన చోటు చేసుకుంది. మంగళవారం బాధితుడు కె.కుమార్ తెలిపిన వివరాల మేరకు ఎన్టీఆర్ జిల్లా ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ జంగా పద్మజ తమ కుటుంబ ఖర్చుల నిమిత్తం రూ.10లక్షల అప్పు తీసుకుని 2019లో పార్ట్ పేమెంట్ కింద రూ.6లక్షలు చెక్కు ఇవ్వగా చెక్కు బ్యాంకులో ప్రజెంట్ చేశామని, అయితే బ్యాంకులో నగదు లేక చెక్కు చెల్లలేదన్నారు. దీంతో చెక్కు బౌన్స్ కేసు వేయగా వాదోపవాదాలు అనంతరం న్యాయమూర్తి కె.సురేష్‌బాబు వైద్యురాలికి 6 నెలలు జైలు శిక్ష, రూ.6 లక్షలు కాంపన్సేషన్ చెల్లించాలని తీర్పు వెలువరించారన్నారు.